


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

మంగళవారం 28 అక్టోబర్ 2025 పేజీలు 06

ఆదిలాబాద్

మంచిర్యాల

నిర్మల్ - కొమరం భీం ఆసిఫాబాద్


ప్రజావాణి దరఖాస్తులను

## త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**


2లో



నవజాత శిశు మరణాలను

## తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్,సూర్య మేజర్ న్యూస్ :

జిల్లాలో నవజాత శిశువుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన నూతన శిశు సంరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరింత అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గిరిజన ప్రాంతం అధికంగా ఉండటం, పలు భౌగోళిక, సామాజిక సవాళ్లు ఉన్నా వైద్య బృందం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే వైద్య శాఖ చేపడుతున్న చర్యల వలన మాత, శిశు, బాల మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. (మిగితా..2లో )

## లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు





**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్,అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్ :**

నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం లక్కీ డ్రా పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌లో గల పి.వి.ఆర్.గార్డెన్స్‌లో నిర్వహించిన లక్కి డ్రా కార్యక్రమానికి ఆబ్కారీ,మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానం ద్వారా దుకాణాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మద్యం దుకాణాల కొరకు 1 వేయి 712 దరఖాస్తులు వచ్చాయని, 73 దుకాణాలకు లక్కీ డ్రా తీయడం జరిగిందని తెలిపారు. నూతన మద్యం పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, దుకాణాల వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేయడం జరిగిందని, లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని, టోకెన్ కలిగి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దుకాణం పొందిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



తుఫాను వలన పంట నష్టం జరగకుండా

## చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్ :**



తుఫాను వలన అకాల వర్షాల కారణంగా పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఎఫ్ సి ఐ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగితా.. 3లో

## పారదర్శకతకు మరో పేరు సింగరేణి

**బెల్లంపల్లి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**



దేశంలోనే అత్యంత పారదర్శకత ఉన్న సంస్థ సింగరేణి అని కె. వెంకటేశ్వర్లు డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ అన్నారు. సోమవారం రోజున గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల సమావేశానికి డైరెక్టర్ పీపీ ముఖ్య అతిథిగా హాజరై జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డి తో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నింటా ముందున్న వారిపైన నిఘా ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుతం సాంకేతికత పెరిగిపోయిందని ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అవినీతి ఏ రంగంలో అయిన అభివృద్దికి అడ్డంకిగా మారుతుందని ఫలితం దేశ పురోభివృద్ధిపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అవినీతి లేకుంటే సమాజం అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా నిజాయితీగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు కిరణ్, డీజీఎం (ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహరా, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, పర్సనల్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్, అన్ని విభాగాల అధిపతులు ఉద్యోగులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ

## సమర్ధవంతంగా నిర్వహించాలి

**- తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి - రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి - పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుంది- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో పత్తి కొనుగోలు, అకాల వర్షాల కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ( మిగితా...3లో )

సూర్య
మంగళవారం 28 అక్టోబర్ 2025

# మద్యం దుకాణాల కేటాయింపుకు లక్కీడ్రా నిర్వహణ

**- పారదర్శకంగా కొనసాగిన ప్రక్రియ**

**- జిల్లా కలెక్టర్ రాజార్షి షా**

**ఆదిలాబాద్ ,అక్టోబర్27,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను సోమవారం స్థానిక రత్న గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షి షా పారదర్శకంగా నిర్వహించారు. ఈ లక్కీ డ్రా కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే. రఘు రామ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఎక్సైజ్ పాలసీ




(2025-2027) ప్రకారం మొత్తం 40 మద్యం షాపుల కేటాయింపులో, 34 షాపులు లక్కీ డ్రా ద్వారా కేటాయించబడ్డాయి. 10 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులకు డ్రా నిర్వహించకుండ, వాటి కోసం మళ్లీ రీ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి షాపుకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా లక్కీ డ్రా నిర్వహించారు. డ్రా ప్రారంభం నుంచి ముగింపు వరకు మొత్తం ప్రక్రియను ఫోటో, వీడియో



రికార్డింగ్ చేయడం ద్వారా పూర్తి పారదర్శకతతో నిర్వహించారు.ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా సాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భద్రతా పరమైన దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారికి లైసెన్స్ ఫీజు చెల్లింపునకు అవసరమైన సదుపాయాలను వేదికపైనే కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు, తదితరులు పాల్గొన్నారు.



### నవజాత శిశు మరణాలను
# తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

మొదటి పేజీ తరువాయి..

ప్రతి ప్రసవ కేంద్రంలో, ప్రతి జనన సమయంలో నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. నవజాత శిశు మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా



ఐసీఎంఆర్ కార్యక్రమంలో భాగంగా రిమ్స్ ఆదిలాబాద్, నిలోఫర్, ఏఐఐఎంఎస్ ఆసుపత్రులు, హైదరాబాద్ సహకారంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణ ద్వారా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రతి శిశు వుకూ సమయానికి సురక్షిత సేవలు అందించే నైపుణ్యం పెంపొందించుకోవాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి వైద్యుడు, నర్సు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలోకి తీసుకురావాలని, ప్రతి శిశువుకు సమయానికి అవసరమైన ప్రాణరక్షక సేవలు అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం శిక్షణలో నవజాత శిశు పునరుద్ధరణ, తల్లిపాలు అందించే ఉత్తమ పద్ధతులు, కంగారూ మదర్ కేర్, సంక్రామణ నియంత్రణ విధానాలు వంటి అంశాలపై నిపుణులు ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, డా. థన్నిగై నాథన్, వైద్యులు, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**నిర్మల్ ప్రతినిధి,అక్టోబర్ 27,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.సోమవారం



కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలిసి ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**ఆసిఫాబాద్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జి 1 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకేపల్లి గ్రామానికి చెందిన పోతిని చిన్న వెంకటస్వామి తనకు గల భూమిలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నానని, ఉత్పత్తి అయినందున విక్రయించుటకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెంచికలపేట మండల కేంద్రానికి చెందిన పాముల నందు తాను గతంలో ఎల్లూర్ గ్రామ శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతల మానేపల్లి మండలం కేంద్రానికి చెందిన ఇప్ప కోసం తన పేరిట ఉన్న భూమికి పట్టా పాసు పుస్తకం కొరకు దరఖాస్తు చేసుకున్నానని, జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణం ద్వారకా నగర్ కాలనీకి చెందిన కత్తెరపాక ప్రమీల తనకు గతంలో ఆసరా పింఛన్ వచ్చేదని, 6 సంవత్సరాలుగా రావడం లేదని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన బానోత్ అనూష బాయి తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన పాలకుర్తి సంతరక్క తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం సోమిని గ్రామానికి చెందిన అల్లూరి లింగయ్య తన భూమి ధరణి పోర్టల్‌లో ఇతరుల పేరిట పట్టా అయినందున సవరించి తన పేరిట పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణంలోని న్యూ కాలనీకి చెందిన కామ్రే మాధవి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ



సమర్పించారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలోని బుద్ధ నగర్ వాసులు తాము 20 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, తమకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తిర్యాణి మండలం మాణిక్యపూర్ గ్రామానికి చెందిన టేకం పోసు బాయి తాను 5వ తరగతి వరకు చదివి ఉన్నానని, కిరాణా షాపు ఏర్పాటు కొరకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, గ్రామీణ అభివృద్ధి సంస్థ లలో మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నానని, రుణం మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

**మంచిర్యాల,బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ, సూర్యనగర్ కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా తమ కాలనీకి నల్లా నీరు రావడం లేదని, నీటిని అందించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన భూపతి జగన్ మోహన్ తన తండ్రి పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రాయిలి సత్యం తాను తన భూమి హద్దుగా కొలత కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సర్వే చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన నేతుల సత్తయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన జె.బాలక్క, ఎస్.సి. కాలానికి చెందిన ఎన్.లక్ష్మి, భూపెల్లి లావణ్య లు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు తమ దరఖాస్తులో సేంద్రీయ ఉత్పత్తుల అవుట్ లెట్ కొరకు స్థలం కేటాయించాలని కోరారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి కిష్టయ్య తన కుమారుడు తన భూములు లాక్కొని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**- తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి - రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి - పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుంది - రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ ప్రక్రియ నిలిపి వేయాలని, హార్వెస్టింగ్ చేసిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుందని, ఈ యాప్ లో కవులు రైతులు కూడా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి రైతులు తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలని, తేమ శాతాన్ని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సరిహద్దు జిల్లాల వారు



అప్రమత్తంగా ఉండాలని, బయట రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు.

రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాల దృష్ట్యా ధాన్యం అడగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలను కవర్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియ కొరకు చర్యలు చేపట్టాలని, కపాస్ కిసాన్ యాప్ లో రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు




కల్పించడంతో పాటు ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 301 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సి సి ఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తుఫాను వలన పంట నష్టం జరగకుండా**

# చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**మొదటి పేజీ తరువాయి..**

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ రాబోయే 2,3 రోజులలో తుఫాను వల్ల రకాల వర్షాల కారణంగా వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయా పంట కొనుగోలు ప్రక్రియలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం మద్దతు ధరతో ఆయా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రవాణా, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేయడం కొరకు 40 కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందని, ఇప్పటివరకు 24 వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు కొరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలుకు సి సి ఐ ఆధ్వర్యంలో 18 జిన్నింగ్ మిల్లులను గుర్తించి నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చే 2, 3 రోజులలో తుఫాను వల్ల పంటలు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, మార్కెటింగ్ శాఖ అధికారి అస్పక్ అహ్మద్, రవాణా శాఖ అధికారి రామ్ చందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# శభరిమల పాదయాత్రను

## ప్రారంభించిన గురుస్వామి బొడ్డు లక్ష్మణ్

**- పాదయాత్రతో శభరిమలకు బయలుదేరిన భక్తుడిని,సన్మానించి శోభాయాత్రను ప్రారంభించిన ఏబీఏపీ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్**

**శ్రీరాంపూర్, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ కాలనీకి చెందిన అయ్యప్ప భక్తుడు బోడ రామకృష్ణ అయ్యప్ప మాల ధరించి మహా పాదయాత్ర ద్వారా శ్రీ భక్తాంజనేయ ఆలయం నుండి సోమవారం వెలుతుండగా యాత్రను అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, రాష్ట్ర మీడియా ఇంచార్జి



బాస్కరి రాజేశం, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్రెడిలు ప్రారంభించారు. ముందుగ ఆలయంలో వేద పండితులు కొమ్మెర విజయ శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం మహా పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప భక్తుడు రామకృష్ణను శ్రీరాంపూర్ కాలనీ అయ్యప్ప సేవా సన్నిదానం గురుస్వాములు శాలువాలతో ఘణంగా సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1400 కిలోమీటర్ల దూరంలోని శభరిమలకు పాదయాత్ర చేయనున్నారని చెప్పారు. పంబా నదికి చేరి శభరిమల అయ్యప్ప స్వామిని 45వ రోజు అయ్యప్ప స్వామిని ధర్శించుకుంటారని చెప్పారు. పాదయాత్ర చేస్తున్న భక్తులకు భగవంతుడు ఆరోగ్యం, శక్తి కల్పించి అయ్యప్ప స్వామి సన్నిదానంకు చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనమాల సత్యనారాయణ, దాసరి నవీణ్, జక్కెన రమేష్,బోడ రాజేష్, గంగాధర్, కేతిరెడ్డి భరత్రెడ్డి, కొండి రజినీకాంత్,ఎగ్గడి వినోద్కుమార్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాల కల్పన

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక





ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను త్వరగా**

# పరిష్కరించాలి

**- ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా**

**ఉట్నూర్ సూర్య మేజర్ న్యూస్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉట్నూరు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి



కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బేలా మండలం బోదిడి గ్రామానికి చెందిన కుమరం దేవరావు తనకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన వెంకటమ్మ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల మండలం రెబ్బన గ్రామానికి చెందిన శిరీష తనకు ఎంబిబిఎస్ చదువుల కొరకు ఫీజు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సూర్య www.suryaa.com
మంగళవారం 28 అక్టోబర్ 2025

## ఇంగ్లీష్ మెటీరియల్ పంపిణి

**ఖానాపూర్ టౌన్ అక్టోబర్ 27 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ గా పనిచేస్తున్న రవీందర్ తన సొంత డబ్బులతో విద్యార్థిని



విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే ఇంగ్లీష్ మెటీరియల్ పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనందం, లెక్చరర్స్ శ్రీదేవి, హమీద్, జాకబ్ తదితరులున్నారు.

## ఆటోలో ప్రయాణించిన ఎమ్మెల్యే జాదవ్

**నేరడిగొండ, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రచారంలో భాగంగా రహమత్‌నగర్ డివిజన్, కార్మిక




నగర్ అటో బస్టాండ్ నుంచి ఆటోలో ప్రయాణించి ఆటో డ్రైవర్ రాజుతో ఆటో డ్రైవరలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని ఆటో డ్రైవర్ వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కి ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ తడాఖా చూపించలని ఆటో డ్రైవర్ ను ఎమ్మెల్యే కోరారు.

### కొనసాగుతున్న మొక్క జొన్న కొనుగోలు కేంద్రం

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### - ఏ డి సి సి సీఈవో శ్రీహరి

**సోన్, అక్టోబర్ 27 సూర్య మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలో వానాకాలం సీజన్ 2025- 26 సంవత్సరానికి గాను మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు



సద్వినియోగం తీసుకోవాలని ఏడీసీసీ సీఈవో శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మొక్కజొన్న వేసిన రైతులు ఆరబెట్టినటు వంటి, మక్కలు 14శాతం తేమ ఉండాలని అన్నారు. మక్కలను మార్క్‌ఫెడ్ కేంద్రానికి తీసుకువచ్చి రూ.2400 మద్దతు ధరకు విక్రయించు కోవాలని కోరారు.

## 15 గ్రాముల గంజాయి పట్టివేత, ఒకరి అరెస్ట్

**కాగజ్నగర్, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

గంజాయి మొక్కల సాగు, రవాణా అమ్మకం వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలంలోని ఈస్గావ్ గ్రామ పరిధి లోని రోడ్డు నెం.11 వద్ద పోలీసులు సోదాలు నిర్వహించి గంజాయి విక్రేతను పట్టుకున్నారు. ఈస్గావ్ ప్రాంతంలో గంజాయి విక్రయం జరుగుతోందని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, టాస్క్ ఫోర్స్ పోలీస్ బృందం సంఘటనా స్థలానికి చేరుకోగా, ఇద్దరు వ్యక్తులు అక్కడి నుండి పారిపోయారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు ఒక వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి మండల్ ప్రశాంత్ తండ్రి రావిన్ మండలం, వయసు 33 సంవత్సరాలు, వృత్తి: రైతు, నివాసం ఈస్గావ్ పరారీలో ఉన్న వ్యక్తులు మిథున్ మండల్, రాహుల్ మండల్ గా గుర్తించారు. పరిశీలనలో భాగంగా నిందితుల బైక్‌లను తనిఖీ చేయగా టి యస్ 20 డి 5936 - మిథున్ మండల్ వద్ద 8 గ్రాముల గంజాయి, టి జి 20 2382 - రాహుల్ మండల్ వద్ద 7 గ్రాముల గంజాయి స్వాధీనం చేయబడింది. మొత్తం 15 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసి ఈస్గావ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ కంధూరి రాజు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్స్ రమేష్, విజయ్ పాల్గొన్నారు.



# సింగరేణిలో అవినీతి నిర్మూలనే విజిలెన్స్ ప్రధాన ధ్యేయం

### - జీఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్**

సింగరేణిలో అవినీతిని నిర్మూలించడమే విజిలెన్స్‌శాఖ ప్రధానధ్యేయం అని ఏరియా సింగరేణి జనరల్‌మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. ఏరియా జిఎం కార్యాలయం






కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలతో పాటు, సింగరేణిలో ఈ నెల 27 నుండి నవంబర్ 2 వ తారీఖు వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సింగరేణిలోని అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల ప్రకారం 1987 సం,, సింగరేణిలో నిఘా విభాగం (విజిలెన్స్ విభాగం) ఏర్పాటు చేయడం జరిగిందని, సంస్థలో అవినీతికి వ్యతిరేకంగా విజిలెన్స్ విభాగం పనిచేస్తుందన్నారు. చీఫ్ విజిలెన్స్ అధికారి బి వెంకన్న ఐ ఆర్ టి ఎస్ ఆధ్వర్యంలో ఈ విజిలెన్స్ విభాగం పనిచేస్తుందని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్య పరిచి అవినీతి నిర్మూలనలో అందరినీ భాగస్వాములను చేయుటే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో ఏమైనా అక్రమాలు జరుగు తున్నాయని గమనించినచో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు దారుల పేర్లు గోప్యంగా ఉంచబడతాయని, దేశ ప్రగతికి అవరోధం అయిన అవినీతిని నిరోధించు బాధ్యత కొద్ది మంది మీదనో వదిలి వేయకుండా, ప్రతి ఉద్యోగి అవినీతి వలన దేశానికి, ఆయా సంస్థలకు జరిగే నష్టాన్ని గుర్తించి అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే ఈ సమస్యను అధిగమించ గలమన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సింగరేణి ఉద్యోగులకు, అధికారులకు వ్యాసరచన పోటీలు, సింగరేణి పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కార్యాలయం ఉద్యోగులతో విజిలెన్స్ "సమగ్రత ప్రతిజ్ఞ" చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సిఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, సీనియర్ పీఓ సత్యనారాయణ, జిఎం ఆఫీస్ హెచ్ఓడిలు, అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### వాటోలి గ్రామంలో కొనసాగుతున్న

## ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

**భైంసా రూరల్,అక్టోబర్ 27,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మూడవ రోజు వాటోలి గ్రామంలో ఉత్సాహంగా కొనసాగింది. విద్యార్థులు గ్రామ అభివృద్ధికి తమ సేవలను సమర్పిస్తూ రోడ్ల శుభ్రత, డ్రైనేజీ శుభ్రత, చెత్త నిర్వాహణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి ముందర ఉన్న చెత్తను సక్రమంగా తొలగించాలని ప్రజలకు చైతన్యం కల్పించడంతో పాటు, పోచమ్మ



మందిరం పరిసరాల్లోని చెత్తను పూర్తిగా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామంలో పరిశుభ్రత ప్రాధాన్యాన్ని అందరికీ తెలియజేశారు. అలాగే "యోగా అభ్యసనం దాని యొక్క ప్రాముఖ్యత" అనే అంశంపై యోగ ఇన్స్ట్రక్టర్ శోభ మందానీ ప్రత్యేక సదస్సు నిర్వహించారు. వద్యార్థులకు యోగ వల్ల కలిగే శారీరక, మానసిక లాభాలను వివరించడంతో పాటు సూర్యనమస్కారాలు, భ్రామరీ, అనులోమ-విలోమ వంటి ఆసనాలను చూపించి ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆరె. రాజు, అధ్యాపకులు ఓం ప్రకాష్, గుంత సుధాకర్, డా. కోసారి సంతోష్ కుమార్, డా. కల్పన, శ్రావణి, రాజయ్య, రామ్మోహన్, అర్షియ బేగం, జి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

### ఝరి(బి) గ్రామానికి బిటి

## రోడ్డు వేయించాలని వినతి పత్రం

**భైంసా టౌన్,అక్టోబర్ 27,సూర్య మేజర్ న్యూస్**

తానూర్ మండలం బోల్సా గ్రామం నుండి ఝరి(బి) మరియు ఝరి(బి) తండా గ్రామాల వరకు బిటి రోడ్డు వేయించాలని కోరుతూ ప్రజావాణిలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ కు ఝరి(బి) గ్రామ యువకుడు గైక్వాడ్ సాయినాథ్ వినతిపత్రం అందించారు. ఇదివరకే ఉన్న రోడ్డు గుంతలమయంగా మారి కంకర బయటకు తేలి ప్రయాణం చేయలేని దుస్థితిలో ఉందని పేర్కొన్నారు. వెంటనే రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సాయినాథ్ మాట్లాడుతూ, రోడ్డు పట్ల సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



## రాజ్ గోండ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**పెంబి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

పెంబి మండల రాజ్ గోండ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా నైతం దుర్గు, గౌరవ అధ్యక్షులుగా



కొమురం దేవు రావు, ఉపాధ్యక్షులుగా తొడసం కేశవ్రావు, ప్రధాన కార్యదర్శిగా గణపతి, వర్కింగ్ ప్రసిడెంట్ గా పగ్గు, కోశాధికారిగా వెడ్మ శేఖర్, జాయింట్ సెక్రటరీగా శ్రీను, ప్రచార కార్యదర్శిగా విశ్వనాథ్, సాంస్కృతిక కార్యదర్శిగా జంగు ఎన్నిక అయ్యారు. ఇందులో ముఖ్య అతిథి గా అంబేద్కర్ సంఘం ప్రచార కార్యదర్శి మల్లెపెల్లి స్వామి పాల్గొన్నారు.

## పోలీసుల కొవ్వత్తుల ర్యాలీ

**లక్సెట్టిపేట, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**




పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి ఉత్కూర్ చౌరస్తా వరకు పోలీసులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గోపతి సురేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పని చేయడమే పోలీస్ గొప్పతనమన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తూ సమాజ హితం కోసం పని చేసి ఎంతోమంది పోలీసులు అమరులయ్యారని వివరించారు. ముఖ్యంగా శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ పాత్ర మరువలేనిదన్నారు. నేటి సమాజంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ న్యాయం వైపే నడుస్తుందని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పలువురు అమర పోలీసుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

## - రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి





**నిర్మల్ ప్రతినిధి అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్.**

హైదరాబాద్ నుండి సోమవారం వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో అకాల వర్షాలు కురిసిన నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు.

వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తుఫాను తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ నిలిపివేయాలని, కోతపడ్డ ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జరుగుతుందని, కౌలు రైతులు కూడా వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అలాగే సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండి, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు వంటి పంటల అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేడ్ 'ఏ' రకం ధాన్యానికి క్వింటాలుకు 2,389, సాధారణ రకానికి 2,369 మద్దతు ధర నిర్ణయించబడిందని తెలిపారు. అదనంగా సన్న వడ్లకు క్వింటాలుకు 500 ప్రోత్సాహక రుసుము అందజేయనున్నట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించి, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. సి.సి.ఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చిస్తూ, తుఫాను ప్రభావం కారణంగా రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తుఫాను ప్రభావం గురించి రైతులకు తెలియజేసి అప్రమత్తం చేయాలని, అవసరమైతే వచ్చే మూడు రోజుల పాటు వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, అధికారులు విజయలక్ష్మి, రాజేందర్, సుధాకర్, నర్సయ్య, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఏరియా లో డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు పర్యటన



**బెల్లంపల్లి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డితో కలిసి సోమవారం పర్యటించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో అన్నివిభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. గోలేటి ఉపరితల గని పనుల ప్రగతిని సమీక్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. నిత్యం 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఖైరిగురర ఓసి నుండి పని స్థలాలను తనిఖీ చేశారు. ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. మగ ఉద్యోగులతో సమానంగా వారు చేస్తున్న పనులను చూసి అభినందించారు. బ్లాస్టింగ్ పనులు ఎలా చేస్తున్నారో ఉద్యోగులు డైరెక్టర్‌కు వివరించారు. ఇలాగే పనిచేస్తే పదోన్నతులు త్వరగా కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖైరిగురర పిఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్‌ఓటు జిఎం కె.రాజమల్లు, మేనేజర్ జే. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి 22 నెలల్లో 451 కోట్ల నిధులు

## - బెల్లంపల్లి రూపు రేకలు మార్చేందుకు ఎమ్మెల్యే వినోద్ కృషి - బీఆర్ఎస్ పార్టీ నేతల కాలం చెల్లిపోయింది - తప్పుడు విమర్శలు చేస్తే ప్రజలు ఉపేక్షించరు - కాంగ్రెస్ అధికార ప్రతినిధి బత్తుల రవి స్పష్టికరణ




**బెల్లంపల్లి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కేవలం గెలిచిన 22 నెలల్లోనే నియోజకవర్గ అభిరుద్ధికి నిధులు తీయిసుకు వచ్చారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బత్తుల రవి తెలిపారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గం అదోగతిపాల యిందన్నారు. షోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ పార్టీ చోటానేత హెూదాను మరిచి ఎమ్మెల్యే వినోద్ పై తప్పుడు విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. బెల్లంపల్లి ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతనిస్తూ బెల్లంపల్లి కి రూ,, 350 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మంజూరు చేయించారాని, అంతే కాకుండా పేద విద్యార్థులకు టెక్నీకల్ విద్యనందించేందుకు ఐటీసీ ని కూడా ఎమ్మెల్యే మంజూరు చేయించారాని రవి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వినోద్ సింగరేణి యాజమాన్యంతో చర్చించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశలు కల్పించేసందుకు మెగా జాబ్ మేళా నిర్వహించారని ఆయన తెలిపారు. జాబ్ మేళాలో ఆన్ లైన్ ద్వారా 9976 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు జాబ్ మేళా కు 6547 మంది నిరుద్యోగులు హాజరుకాగా వారిలో 3039 మందికి ఉద్యోగ నియామకపు పత్రాలు అందజేశారని రవి తెలిపారు. నిరుద్యోగులకు రూపాయి కూడా ఖర్చులేకుండా ఉచితంగా జిరాక్స్ పత్రాలు కూడా తీసుకునేందుకు సింగరేణి సంస్థ జిరాక్స్ మిషన్ లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. నిరుద్యగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే తప్పేంటని బీఆర్ఎస్ నాయకులను ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధిని పదేళ్లలో గాలికి వదిలేసిన బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎమ్మెల్యే వినోద్ చేస్తున్న అభివృద్ధినిచూసి ఓర్వలేక షోషల్ మీడియా లో తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ,, 19.81కోట్లతో రోడ్లు,రూ,,6.14 కోట్లతో పాటశాలలకు కంపౌండ్ వాల్స్ నిర్మించారని, రూ,, 7.03 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల,అంతే కాకుండా అభివృద్ధి కొరకు స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్స్ రూ,, 10 కోట్లు, డి ఎం ఎఫ్ టీ నిధులు రూ,,10 కోట్లు,సీఎస్ఆర్ నిధులు రూ,,3.4 కోట్లతో, సీఆర్ఆర్ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ,, 17 కోట్లతో చేపట్టిన పలు పనులు కొన్ని పూర్తి కాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. అమృత్ 2.0 పథకం కింద రూ,, 61.50కోట్ల తో బెల్లంపల్లి మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీటినందించే పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. పీఎంజెన్ దన్ పథకం కింద రూ,, 2.83 కోట్లు, పీ ఎం జీ ఎస్ వై కింద రూ,, 1.93 కోట్లు, 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ,, 1.43 కోట్లు, 2023-24 స్పెషల్ డెవలప్ మెంట్ నిధులు రూ,, 1.29 కోట్లు, ఆర్ అండ్ బీ శాఖ ద్వారా రూ,, 5.40 కోట్లతో గ్రామాల్లో మురికి కాలువలు,రోడ్ల పనులు పూర్తయ్యాయన్నారు. పాఠశాలల మరమత్తులకు రూ,, 3.20 కోట్లు, ఇరిగేషన్ నిధులు రూ,, 64 లక్షలు, ఐటీడీఏ నిధులు రూ,, 23 కోట్ల తో గ్రామాల్లో రోడ్లు, నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇళ్ళు కూడా పేద ప్రజలకు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వినోద్ నియోజక వర్గంలో ఇళ్ళు లేని పేద ప్రజలకు 3,500 ఇందిరమ్మ ఇళు ళ్ళ మంజురు చేయించారని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని రాంనగర్, మండలంలోని చర్లపల్లి లలో రూ,, 20 లక్షలతో నూతన పాటశాల భావనాలు నిర్మించడం జరిగిందన్నారు. నెన్నెల, బెల్లంపల్లి లోని కేజీవీబీ పాటశాలల భవనాలకు రూ,, 6 కోట్లు, తాండూర్‌లో హాస్టల్ కు రూ,, 2 కోట్లు, బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ 18 కోట్ల నిధులు ఎమ్మెల్యే మంజూరు చేయించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. నాటి బీఆర్ఎస్ పాలకులు పేద ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఒక కోటి మందికి కొత్త రేషన్ కార్డు లు ఇచ్చిన విహాయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రహించాలని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వినోద్ పై తప్పుడు విమర్శలు మానుకోవాలని లేని యెడల ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దూడం మహేష్, మైదం రమేష్, గోలేటి స్వామి,మారపాక వంశీ, బండి రాము, కన్నూరి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# గోలేటి ఉపరితల గనితో పూర్వవైభవం

**రెబ్బెన, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

గోలేటి ఉపరితల గని ప్రారంభం అయితే బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం వస్తుందని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గోలేటిలోని సింగరేణి అతిథి గృహంలో కొమురం భీం



ఆసిఫాబాద్ శాసన సబ్యురాలు కోవలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోలేటి ఓసి ఆవశ్యకతను ఎమ్మెల్యే కు వివరించారు. ప్రస్తుతం ఒక్క ఖైరిగురర ఉపరితల గని నుండి మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. గోలేటి ఓసి త్వరగా ప్రారంభం అయ్యేందుకు తమ వంతు సహకారం అందించాలని ఆమెను కోరారు. అనంతరం జిఎం ఎం విజయ భాస్కర్ రెడ్డి, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు తో కలిసి ఎమ్మెల్యే ను సన్మానించి మొక్కను బహూకరించారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

**కడెం, అక్టోబర్ 27,సూర్య మేజర్ న్యూస్ :**

కడెం మండలం పాండవపూర్ శివారుల పేకాట స్థావరంపై కడెం పోలీసులు, వారికి అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఆ చోట పేకాట ఆడుతున్న 7 గురుని ఆదుపులోకి తీసుకొని వారి వద్దనుండి 3500 నగదు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పేకాట ఆడటం చట్ట రీత్యా నేరం అని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని కడెం ఎస్సై తెలిపారు.

## ఎంపీడివోగా మహమ్మద్ రయిస్ ఉల్ల బాధ్యతల స్వీకరణ

**సిరికొండ అక్టోబర్ 27 సూర్య మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని మండల



పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవోగా మహమ్మద్ రయిస్ ఉల్ల పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఇంచార్జ్ ఎంపీడీవోగా రవీందర్ విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో ఎంపీడీవోగా మహమ్మద్ రయిస్ ఉల్ల పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.

## బేల మండల నూతన ఎంపీడీవోగా ఆంజనేయులు.

**బేల, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్ :**



మండల నూతన ఎంపీడీవోగా ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఎంపీడీఓ మాట్లాడతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

సూర్య www.suryaa.com

మంగళవారం 28 అక్టోబర్ 2025

## ఆత్రం ధర్మరాజు కుటుంబాన్ని
# పరామర్శించిన న్యాయవాది పంద్రం శంకర్

**నేరడిగొండ, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన ఆత్రం ధర్మరాజు రోడ్డు ప్రమాదం మరణించిన విషయాన్ని న్యాయవాది పందరంన్యాయవాది పంద్రం



శంకర్ తెలుసుకొని సోమవారం ఆత్రం ధర్మరాజు ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ వాది పంద్రం శంకర్ వెంట గ్రామ పటేల్ సిడం మల్లేష్, మడావి బాపురావు, సునీల్,తానాజీ, ఆషా రావు పటేల్, పెందూర్ భీమ్రావు, సిడం సంతోష్, శంభు శంభు భూమన్న,భూమన్న, తదితరులు ఉన్నారు.

# ఉరి వేసుకుని ఆత్మహత్య

**ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం శాంతినగర్ కాలనీ కి చెందిన కోమటిపల్లి



నడిపి పోశెట్టి మద్యం సేవించి గాంధీనగర్ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.బార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపినారు.

# నేడు విద్యుత్ అంతరాయం

**ఖానాపూర్ టౌన్ అక్టోబర్ 27 సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ పట్టణంలోని బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతాలలో మంగళవారం రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్




అంతరాయం ఉంటుందని ఏ ఈ రాంసింగ్ తెలిపారు. విద్యుత్ ఆధునికరణ పనుల రిత్యా అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరినారు.

# వ్యక్తి కనబడుట లేదు

**సోన్, అక్టోబర్ 27 సూర్య మేజర్ న్యూస్:**

బంధువుల పెళ్ళికి వచ్చి కనబడకుండా పోయిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణం నిజాంబాద్ జిల్లా కు చెందిన రాజారామ్ సాయ రెడ్డి



వ్యవసాయం చేస్తుండేవాడని తెలిపారు. ఈనెల 24 తేదీన మండలంలోని కడ్తాల్ గ్రామా శివారులో గల సాగర్ కన్వెన్షన్ హాల్ లో బంధువుల పెళ్ళికి వచ్చాడు. బంధువులకు చెప్పి బయటకు వెళ్ళాడు. అప్పటినుండి ఆయన ఆచూకీ తెలియలేదు. అతని కొడుకు రాజారామ్ సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

# పాపం పసిపాప!

**కాగజ్నగర్, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

ఈరోజు అనగా తేదీ 27-10-2025 రోజున ఉదయం రైలు నంబర్ 12791 దానాపూర్ ఎక్స్ ప్రెస్ రైలు బండిలో బ్యాక్ సైడ్ జనరల్ కోచ్ లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో ఒక ఆడ వ్యక్తి అందాద 45 రోజులు గల ఆడ పాపను తీసుకుని ప్రయాణం చేయుచు కాజీపేట రైల్వే స్టేషన్లో పక్క ప్యాసింజర్ కు పాపను పట్టుకోమని చెప్పి, నేను ప్లాట్ఫారం పైన పాపకి ఏమైనా తీసుకొని



వస్తానని చెప్పి కిందికి దిగినది, అట్టి ఆడ వ్యక్తి ట్రైన్ ఎక్కకపోవడం వలన పెద్ద పెల్లి రైల్వే స్టేషన్ వరకు చూసి కంట్రోల్ కు ఫోన్ చేయగా అట్టి పాపను సిర్పూర్ కాగజ్నగర్ రైల్వే స్టేషన్లో జి ఆర్ పి మరియు ఆర్ పి ఎఫ్ సిబ్బంది దించుకొని ఆసిఫాబాద్లోని చైల్డ్ కేర్ సెంటర్ వారికి అప్పగించడం జరిగినది.

# మృతుని కుటుంబానికి తోడుగా నిలిచిన మిత్ర బృందం

**సిర్పూర్ టి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

మిత్రుడు తమ నుండి దూరమైనప్పటికీ ఆ మిత్రుడి కుటుంబం ఇబ్బందుల పాలు కాకుండా అండగా నిలవాలని తలంచారు మిత్రబృందం సభ్యులు. అనుకున్నది తడువుగా తలా కొంత జమ చేసి తమ మిత్రుడి కుటుంబానికి



ఆర్థిక సాయం అందించిన సంఘటన కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి లో చోటుచేసుకుంది. సిర్పూర్ టీ మండల కేంద్రానికి చెందిన డోంగ్రే అరుణ్ గత 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. డిగ్రీ లో తమతో కలిసి చదువుకున్న తమ మిత్రుడు మృతి చెందడం తో కుటుంబం పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని ఇవాళ సిర్పూర్ టీ గ్రామాని కి వచ్చి తమ మిత్రుడు డోంగ్రే అరుణ్ కుటుంబ సభ్యులకు కాగజ్నగర్ మిత్రబృందం ఆర్థిక సహాయం అందజేశారు. ఇక ముందు కూడా వారి కుటుంబ సభ్యులకు ఏ సమస్య వచ్చినా మేము అండగా ఉంటామని డోంగ్రి అరుణ్ మిత్ర బృందం మిత్రుడి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఇది కదా మిత్రృత్వం అంటే. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు.

# కఠినంగా శిక్షించాలని కలెక్టర్ కు వినతి

**కాగజ్నగర్, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్:**

కుల దురహంకార హత్యకు గురైన తలండి శ్రావణి (రాణి) కుటుంబానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో ఆదివాసీ మహిళ తలండి శ్రావణి ఈ నెల 18వ తేదీన కుల దురహంకార హత్యకు బలయ్యారు. తలండి శ్రావణి (రాణి), 21 సం., ఎస్టీ (పర్ధాన్), శివార్ల శేఖర్, బీసీ (బెస్త)ల వివాహం 09-10-2024న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శివాలయంలో జరిగింది. ఈ రెండు కుటుంబాలు కుమురంభీం అసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో ఎదురెదురు ఇళ్లల్లో నివసిస్తున్నాయి. ఈ వివాహానికి శేఖర్ తండ్రి శివార్ల సత్తయ్య మరియు ఆయన కుటుంబం అంగీకరించలేదు. దీనితో వీరిద్దరూ శివార్ల శ్రావణి (రాణి) తండ్రి చెన్నయ్య ఇంట్లోనే కాపురం ఉంటున్నారు. శ్రావణి చనిపోయే సమయానికి నిండు గర్భిణీ. 9 మాసాలు నిండాయి. తెల్లవారితే బిడ్డకు జన్మనిచ్చేది. ఇది గమనించిన మామ శివార్ల సత్తయ్య బిడ్డకు జన్మనివ్వకూడదనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం తేది 18-10-2025న ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె మర్మాంగంపై, కడుపులో గొడ్డలితో నరికాడు. ప్రాణభయంతో పారిపోతున్న ఆమెను వెంటాడి గొడ్డలితో తల నరికి అతి కిరాతకంగా హత్య చేశాడు. సత్తయ్యకు తోడుగా ఆయన పెద్ద కుమారుడు శివార్ల కుమార్, కోడలు కవిత కూడా ఈ హత్యలో పాల్గొన్నారు. శ్రావణి భర్త శేఖర్ అత్తమామలతో కలిసి తన స్వంత వాహనమైన టాటా మ్యాజిక్‌లో కట్టెలు తీసుకురావడానికి అడవికి వెళ్లాడు, పథకం ప్రకారమే శేఖర్ అత్తమామాలను అడవికి తీసుకువెళ్లినట్లు అనుమానం ఉంది. అతి కిరాతకంగా చంపిన శ్రావణి మామ శివార్ల సత్తయ్య మరియు కుటుంబ సభ్యులు శివార్ల కుమార్, శివార్ల కవితలపై అట్రాసిటీ కేసుతో పాటు జీవిత ఖైదు విధించాలని, సత్తయ్యకు ఉన్న ప్రభుత్వ భూమిని శ్రావణి కుటుంబానికి ఇప్పించాలని, ప్రభుత్వ పరంగా ఎక్స్ గ్రేసియా ఇవ్వాలని అలాగే శ్రావణితో పాటు కడుపులో ఉన్న పాప కూడా హత్యకు గురయ్యారు. కావున రెండు హత్యలకు సంబంధించిన కేసులు పెట్టాలి. ఎఫ్ఐఆర్ లో కుటుంబ సభ్యుల పేర్లు లేవు. అందరి పేర్లు పెట్టాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేయాలి. శ్రావణి భర్త అయిన శేఖర్ పాత్ర ఉంది, కావున శేఖర్ ను కూడా అరెస్ట్ చేయాలి. వెంటనే జిల్లా కలెక్టర్ గా మీరు గ్రామాన్ని సందర్శించాలి. గెర్రె గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. శ్రావణి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి. శ్రావణి కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలి. శ్రావణి కుటుంబానికి 5 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇవ్వాలి. కుల దురహంకార ఆగడాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా అవగాహన సదస్సులు జిల్లా వ్యాప్తంగా అధికారులు నిర్వహించాలనీ ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాల శ్రీ, నేర్పెల్లి అశోక్, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, సిపిఎం పార్టీ కాగజ్నగర్ కన్వీనర్ ముంజం ఆనంద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టీకానంద్ గోడిసెల కార్తిక్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, నిఖిల్ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వసాకే సాయి చాపిలే సాయి కృష్ణ ఐద్వా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వినోద అనిత జిల్లా ఐద్వా కోశాధికారి షాహిన్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు బక్కన్న ,నైతం రాజు దహేగం మండల అధ్యక్షులు సిడాం




శంకర్, జిల్లా కమిటీ సభ్యురాలు దూల లక్ష్మి ,శాగం కమల గ్రామ అధ్యక్షులు మేకల శంకర్, కట్టేకోల హనుమంతు ,దహేగాం మండలంలోని గేర్రె చిన్నరాస్పల్లి ఒడ్డుగూడా తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహన పార్కింగ్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ

**మందమర్రి, అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్**

కార్మికుల వాహనాల సౌలభ్యం కోసం ఏరియాలోని వర్క్ షాప్ లో నూతన మోటార్ సైకిల్ స్టాండ్ నిర్మాణా పనులకు భూమి పూజ నిర్వహించారు. వర్క్ షాప్ ఆవరణలో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో వర్క్ షాప్ డివైజిఎం దూప్ సింగ్, ఎఐటియుసి నాయకులు భీమనాధుని సుదర్శన్ లు



మోటర్ సైకిల్ స్టాండ్ నిర్మాణా నికి సంప్రదాయ పద్ధతిలో పూజారి మంత్రో చ్ఛారణ మధ్య భూమి పూజ చేసి కొబ్బరి కాయలు కొట్టి నూతన షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు భీమనాధుని సుదర్శన్ మాట్లాడుతూ వర్క్ షాప్ ఆవరణలో ఇదివరకు ఉన్న మోటార్ సైకిల్ స్టాండ్ సరిపోవడం లేదని, అదనంగా మరో నూతన స్టాండ్ నిర్మాణం చేపట్టాలని గుర్తింపు సంఘం ప్రతిపాదన మేరకు ఏరియా అధికారులు మరో నూతన మోటార్ సైకిల్ స్టాండ్ నిర్మాణానికి అంగీకరించడంతో నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్మికుల సమస్యల సాధనతో పాటు కార్మికుల సంక్షేమానికి గుర్తింపు సంఘం ఏఐటియుసి నిర్విరామంగా కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ డివైజిఎం దూప్ సింగ్, ఇంజనీర్లు, అధికారులు సత్య గౌడ్, సదానందం, నాగుల శ్రీనివాస్, ఎఐటియుసి పిట్ కార్యదర్శి సిహెచ్ పి శర్మ, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, పిట్ నాయకులు ఎగ్గేటి రాజేశ్వర్ రావు, పారిపెల్లి రాజేశం, ఇతర యూనియన్ నాయకులు వై శ్రీనివాస్, చంద్రశేఖర్, భాస్కర్, తోట రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రం నుండి అయోధ్యకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

**నిర్మల్ ప్రతినిధి అక్టోబర్ 27, సూర్య మేజర్ న్యూస్**

ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి ఈ రోజు అయోధ్య, కాశీ బస్సు బయలు దేరుచున్నట్లు డిపోమేనేజర్ కే పందరి తెలిపారు.ఈ బస్సు నిర్మల్ నుండి మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్మల్ నుండి బయలు దేరి మరుసటి రోజు ఉదయం ప్రయాగ్ రాజ్ చేరుకుంటుంది.ప్రయాగ్ రాజ్ లో త్రివేణి సంగమం లో పవిత్ర స్నానం ఆచరించిన పిమ్మట అయోధ్యకు వెళ్తుంది.అయోధ్యలో రామ జన్మభూమి, బాలరామున్ని దర్శించుకొని 28 వ తేదీ సాయంత్రం కాశీ చేరుకొని ఆ రాత్రి కాశీలోనే బస్సు ఉంటుంది. తెల్లవారి కాశీ విశ్వనాధ టెంపుల్, విశాలాక్షి అమ్మవారి దర్శనం, అన్నపూర్ణ ఆలయం బోట్ లో 84 ఘాట్ లను సందర్శనం గంగా హారతి అనంతరం కాశీ నుండి బయలుదేరి 30 వ తేదీ రాత్రి నిర్మల్ కు చేరుకుంటుంది. ఈ బస్సు ఆన్ లైన్ లో పెట్టిన రెండు రోజుల్లోనే సీట్లు ఫుల్ కావడం వలన భక్తుల కోరిక మేరకు నవంబర్ 6 వ తేదీ రోజు మరొక బస్సు అయోధ్య, కాశీ పెట్టమని యాత్ర రాదలచిన వారు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలని డిపోమేనేజర్ కే పందరి తెలిపారు. ఆర్టీసీ బస్సులో యాత్రలు చేయడం చాలా క్షేమకరం, సురక్షితం అని ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు.

# రైతులు అంటే ఇంత చిన్న చూపు..మాజీ మంత్రి జోగు రామన్న

**బేల, అక్టోబర్ 27: సూర్య మేజర్ న్యూస్ :**

కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు రైతుల ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కొనుగోలుపై ఇంత చిన్నచూప అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు.బేల మండల కేంద్రంలో సొయా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ మంత్రి జోగు రామన్న బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బేల జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి రైతు సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. సోయా పంటను చేత చూయిస్తూ వినూత నిరసన చేపట్టారు. మార్కెట్ అధికారులు సోమవారం సొయా కొనుగోలు ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పడం తో రైతులు ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ తక్షణం కొనుగోలు ప్రారంభించకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నరు. ప్రకృతి విపత్తులతో అధిక వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం రైతులకు ధైర్యాన్ని ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు.తేమ శాతం లేకుండా సోయా పత్తి కొనుగోలు చేయాలని జోగు రామన్న డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రుణాలను రెన్యువల్ చేస్తూ బ్యాంకుల నుండి సహాయాన్ని అందించినట్లయితే రెండో పంటకు రైతులకు మేలు చేసినట్లు అవుతుంది అన్నారు.కిసాన్ కపాస్ యాప్ ద్వారా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తక్షణం దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ ఎమ్మెల్యే జిల్లా రైతాంగా సమస్యలను పట్టించుకోకుండా కేవలం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారాలు పాల్గొనడం సిగ్గుచేటు అన్నారు. జిల్లాలో ప్రారంభించిన పత్తి కొనుగోలు ఆరంభంలోనే రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని జోగు రామన్న మండిపడ్డారు.. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునే చర్యలు చేపట్టకుంటే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో రవుత్ మనోహర్, ప్రమోద్ రెడ్డి, సతీష్ పవర్, గంభీర్ టాక్రె, విపిన్, మాస్కె తేజీరావ్, జితేందర్, బాలచందర్, తన్వీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.